ముత్యాల ముగ్గు మురిసింది. సంక్రాంతి పండుగను వారం రోజుల ముందే అతివలు తమ రంగవల్లులతో స్వాగతం పలికారు. ఏబీఎన్- ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సౌజన్యంతో లోకల్ స్పాన్సర్ల సహకారంతో తిరుపతి, చిత్తూరు, మదనపల్లెలో ఆదివారం ముగ్గుల పోటీలు జరిగాయి. మొత్తం 239 మంది మహిళలు హాజరై ఉత్సాహంగా ముగ్గులేశారు.



జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ముగ్గు విజేత ఎం.విద్య (తిరుపతి)

తిరుపతిలో...




రెండో బహుమతి తీసుకుంటున్న కె.లోకేశ్వరి




మూడో బహుమతి అందుకుంటున్న సీహెచ్ అనూరాధ

- మహిళల కళాసృజనకు పట్టం గట్టిన ఏబీఎన్- ఆంధ్రజ్యోతి



చిత్తూరులో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



మురిసిన ముత్యాల ముగ్గు

- తిరుపతి, చిత్తూరు, మదనపల్లెల్లో విరిసిన రంగవల్లులు
- వారం ముందే సంక్రాంతి సందడి

చిత్తూరులో...




మొదటి బహుమతి అందుకుంటున్న బుజ్జీరావు




రెండో బహుమతి తీసుకుంటున్న పొన్నియమ్మ




మూడో బహుమతి అందుకుంటున్న రాణి

ఆంధ్రజ్యోతి, తిరుపతి: తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగిన ముగ్గుల పోటీల్లో 87 మంది పాల్గొన్నారు. ఈ పోటీలకు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లోకల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి హాజరవగా, న్యానిర్ణేతలుగా శ్రీపద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.యువశ్రీ, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్ తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ బి.తేజోవాణి వ్యవహరించారు. ఎం.విద్య (కొర్లగుంట), కె.లోకేశ్వరి (భవాని నగర్), సీహెచ్ అనూరాధ (సత్యనారాయణపురం) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి ముఖ్యఅతిథితో పాటు సైకం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత సైకం జయచంద్రారెడ్డి, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఐదుగురికి కన్సొలేషన్ బహుమతులను బాలాజీ మొబైల్స్ అధినేత, బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి వాచీలు అందజేశారు. పాల్గొన్న ప్రతిఒక్కరికీ శుభమస్తు అసిస్టెంట్ మేనేజర్ వెంకటేష్, టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ప్రత్యేక కానుకలు అందజేశారు.

చిత్తూరు: చిత్తూరులోని ఎన్‌పీసీ పెవిలియన్ కల్యాణమండపంల జరిగిన ముగ్గుల పోటీల్లో 76 మంది పాల్గొన్నారు. లోకల్ స్పాన్సర్‌గా విజయం విద్యాసంస్థలు వ్యవహరించాయి. కార్పొరేషన్ కమిషనర్ అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, విజయం విద్యాసంస్థల డైరెక్టర్ శైలజ, సావిత్రమ్మ డిగ్రీ కాలేజ్ తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ జి.ఉషారాణి, పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కాలేజ్ అధ్యాపకురాలు మమత న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డి.బుజ్జిరావు (లక్ష్మినగర్ కాలనీ), వి.పొన్నియమ్మ (ఎంజీఆర్‌వీధి), ఎ.రాణి (శంకరయ్యగుంట) వరుసగా అందుకున్నారు. వీరికి ముఖ్య అతిథితో పాటు న్యాయ నిర్ణేతలు బహుమతులను ప్రదానం చేశారు.

మదనపల్లె: మదనపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ముగ్గుల పోటీలకు 76 మంది మహిళలు, యువతులు పాల్గొన్నారు. ఈ పోటీలకు శ్రీనివాస డిగ్రీ కాలేజ్, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ లోకల్ స్పాన్సర్లుగా వ్యవహరించారు. డి.వి.పూర్ణ, ఎస్.పద్మ, బి.మల్లిక వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. వీరికి ముఖ్య అతిథి, మదనపల్లె ఆర్డీవో ఎం.ఎస్.మురళి, శ్రీనివాసడిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, శ్రీకాంత్ గాజుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారెడ్డి, న్యాయనిర్ణేతలు మోహన్‌వల్లి, ఉషారాణి బహుమతులు అందజేశారు.

మదనపల్లెలో...




మొదటి బహుమతి అందుకుంటున్న డి.వి.పూర్ణ




రెండో బహుమతి తీసుకుంటున్న ఎస్.పద్మ




తృతీయ బహుమతి అందుకుంటున్న బి.మల్లిక

పాలకూరులో కవ్వింపు చర్య

- ఎన్టీఆర్ విగ్రహం పాక్షిక ధ్వంసం
- టీడీపీనేత దుకాణానికి చెప్పులు, చీపుర్ల మాల
- వైసీపీ పనేనంటూ ఫిర్యాదు



పాక్షికంగా దెబ్బతిన్న ఎన్టీఆర్ విగ్రహం

పూతలపట్టు, జనవరి 7: పూతలపట్టు మండలం పాలకూరులో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం.. టీడీపీ నేత దుకాణానికి చెప్పులు, చీపుర్లు కట్టారు. ఇదంతా వైసీపీ వారిపనిగా టీడీపీ నేతలు అనుమానిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఎగువపాలకూరు దళితవాడకు చెందిన గురుస్వామి 15 ఏళ్ల కిందట స్థానిక నేతల సహకారంతో పాలకూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఈ విగ్రహాన్ని రాళ్లతో కొట్టడంతో కొద్దిగా దెబ్బతింది. పూర్తిగా ధ్వంసం చేయడానికి వీలుకాలేదు. దీంతో అక్కడి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. పక్కనే ఉన్న టీడీపీ ఎస్సీ సెల్ నేత గురుస్వామి చిల్లర దుకాణానికి చెప్పులు, చీపుర్లతో మాలవేసి, ఆవుపేడ తెచ్చి దుకాణం ముందు పడేశారు. ఉదయాన్నే దుకాణం వద్దకు వచ్చిన గురుస్వామి కుటుంబీకులు వీటిని చూసి ఆవేదన చెందారు. పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ కలికిరి మురళీమోహన్, మండల పార్టీ కన్వీనర్ దొరబాబు చౌదరి, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ చంద్రమౌళికి సమాచారమిచ్చారు. వీరితోపాటు భారీగా టీడీపీ శ్రేణులు పాలకూరుకు చేరుకోవడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ సమాచారం అందుకున్న చిత్తూరు టౌన్ డీఎస్పీ శ్రీనివాసమూర్తి, పూతలపట్టు సీఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో గ్రామానికి విచారించారు. ఎగువపాలకూరు దళితవాడకు చెందిన ఐదుగురు వైసీపీ వారిపై తమకు అనుమానం ఉందని గురుస్వామి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

24 గంటల్లో నిందితులను అరెస్టు చేయాలి

ఎన్టీఆర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన వారిని 24 గంటల్లో అరెస్టు చేయకపోతే ఆందోళన తీవ్రం చేస్తామని పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ హెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రశాంతమైన గ్రామంలో వైసీపీకి చెందిన బడా నాయకులు యువకులకు మద్యం తాగించి ఇలాంటి ఘటనలకు తెరతీయడం సమంజసం కాదన్నారు. ఈ ఘటనకు ప్రేరేపించిన వారితో పాటు నిందితులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. వారిని పోలీసులు వదిలిపెట్టినా తాము వదలబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గంగారపు గోపి, దొరబాబు చౌదరి, చంద్రమౌళి, ప్రమోద్, మోహన్, చిరంజీవి, కార్తికేయ చౌదరి, ఆర్.ఎస్. బాబు, రాజశేఖర్ నాయుడు, వేణు, రామచంద్ర నాయుడు, దేవరాజు నాయుడు, మధు, నాదముని, హరి, హిమకర్, హిమగిరి నాయుడు, సుబ్బరాజులు, వేణు, ఇతర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ నేత దుకాణ తలపుదుకాణానికి చెప్పులు కట్టిన వేసిన గుర్తుతెలియని వ్యక్తులు

ఆరుగురు సీఐల బదిలీ

చిత్తూరు, జనవరి 7: జిల్లాలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన వారంతా రెండు మూడు రోజుల్లో కేటాయించిన చోట్ల విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వులో పేర్కొంది. చిత్తూరు తాలూకా సీఐ గంగిరెడ్డిని చిత్తూరు ఎస్‌బీకి బదిలీచేశారు. కుప్పం అర్బన్ సీఐగా ఉన్న శ్రీధర్‌ను సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌కు.. దిశ సీఐ బాలయ్యను చిత్తూరు డీసీఆర్‌బీకి.. డీసీఆర్‌బీలోని సుబ్రహ్మణ్యంను అనంతపురం జిల్లా వీఆర్‌కు.. చిత్తూరు వీఆర్‌లో ఉన్న ఆశీర్వాదంను అనంతపురం జిల్లా వీఆర్‌కు.. వీఆర్‌లో ఉన్న ప్రసాద్‌బాబును శ్రీసత్యసాయి జిల్లా వీఆర్‌కు.. వీఆర్‌లో ఉన్న చల్లనిదొరను అనంతపురం జిల్లా వీఆర్ రేంజ్‌కు బదిలీ చేశారు.




నగరిలో ఎస్మా జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు - కలెక్టరేట్ ముందు అంగన్వాడీల రిలే దీక్షా శిబిరం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

ఎస్మా బెదిరింపులకు భయపడం

- జీవో ప్రతులను దహనం చేసిన అంగన్వాడీలు

చిత్తూరు, జనవరి 7: ఎస్మా పేరు చెప్పి బెదిరిస్తే తాము భయపడేది లేదని అంగన్వాడీలు తేల్చి చెప్పారు. ఎస్మా జీవో ప్రతులను ఆదివారం దహనం చేసి నిరసన తెలిపారు. అంగన్వాడీల సమ్మె ఆదివారమూ కొనసాగింది. కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. వీరికి ఏఐటీయూసీ నేతలు మద్దతు పలికారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోగా బెదిరింపు ధోరణికి పాల్పడుతూ జీవో నెంబరు-2ను తీసుకొచ్చి ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. కుప్పం సీడీపీవో కార్యాలయంవద్ద అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా.... బెదిరింపులకు దిగుతోందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. 27 రోజులుగా నిరసనలు, ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉద్యమాన్ని అణచివేయాలనే ఉద్దేశంతో ఎస్మాను ప్రయోగించడం దారుణమన్నారు. పలమనేరులో అంగన్వాడీ వర్కర్లు సీడీపీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జీవో నెంబరు-2 ప్రతులను దహనం చేశారు. పుంగనూరు, కార్వేటినగరంలో తమ నిరసనలో భాగంగా జీవో ప్రతులను దహనం చేశారు.

చెవిలో పువ్వుతో నిరసన



వైసీపీ ప్రభుత్వం తమ చెవిలో పువ్వులు పెట్టి ఏమార్చిందని పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. చిత్తూరులో ఆదివారం వీరు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. తనకు అవకాశం ఇస్తే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు.

- చిత్తూరు

పంటలపై కొనసాగిన గజదాడులు



కల్లూరు, జనవరి 7: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీలో శనివారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో కొబ్బరి, మామిడి, వేరుశెనగ పంటలకు అపారనష్టం వాటిల్లింది. కమ్మపల్లికి చెందిన రైతు సిద్దయ్యనాయుడు పొలంలోని 10 కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు పశుగ్రాసం, వేరుశెనగ పంటను తొక్కేశాయి. దేశిరెడ్డిగారిపల్లికి చెందిన మోహన్‌రెడ్డి 20 మామిడిచెట్లు, కమ్మపల్లికి చెందిన రఘుపతి 10 మామిడిచెట్లను ఏనుగులు విరిచేశాయి. 20 ఏళ్ల కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయని బాధిత రైతు సిద్దయ్యనాయుడు వాపోయాడు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహరరెడ్డి

పలమనేరు, జనవరి7 : రాష్ట్రంలోని పెన్షనర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని పలమనేరు పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహరరెడ్డి డిమాండు చేశారు. ఆదివారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. అంతకు ముందు జీవోల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జైకిషోర్, దొరస్వామి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను అందరికీ అందజేశారు. ఉపాధ్యక్షుడు గురుమూర్తి మాట్లాడుతూ ఒక ట్రెజరీ నుంచి మరో ట్రెజరీకి బదిలీ ఏవిధంగా చేసుకోవాలో వివరించారు. సమావేశంలో యూటిఎఫ్ నాయకులు సీపీప్రకాష్, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఐదవరోజూ మున్సిపల్ కార్మికుల నిరసన



పలమనేరు, జనవరి7 : పలమనేరు మున్సిపల్ కార్మికులు ఆదివారం ఐదవరోజు కూడా తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు చెల్లించాలని, టైంస్కేలు వర్తింపజేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ, సగం జీతం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, జాన్‌ఆనంద్, రమేష్‌బాబు, ఎం.బాలాజీ, వైబాబు, బి.వెంకటేష్, ఆర్.వాసు, సురేష్, ఎం. ఆనంద్, అంజి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న సాంబశివ

పలమనేరు, జనవరి7 : వార్డు, గ్రామ సచివాల యాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు పనిభారం తగ్గించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లీలావతి, ఉపప్రధాన కార్య దర్శి సాంబశివ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పలమనేరు ఉర్దూ పాఠశాల ఆవరణలో సచివాలయాల ఏఎన్‌ఎంల సమావేశంలో వారు ప్రసంగించారు. ఇతరశాఖల ఉద్యోగుల కంటే సచివాలయాల్లో పనిచేసే ఏఎన్‌ఎంలు రోజుకు మూడుసార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తున్నందున ఇబ్బందికరంగా వుందన్నారు. కావున బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. వీరికి సాధారణ బదిలీల అవకాశం కల్పించాలని కోరారు. యూనిఫారం, అలవెన్సులు, గ్రేడ్-3నుంచి హెల్తు అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎంలు అముద, సుజాత, ఇంద్రాణి, మాధవి, రెడ్డెమ్మ, భారతి, మంగమ్మ, సుగుణ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌దే

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కృష్ణదేవరాయుల విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

పుంగనూరు, జనవరి7: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం భీమగానిపల్లె బైపాస్‌రోడ్డు క్రాస్‌లో కృష్ణదేవరాయుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ 2014లో దాదాపు 600 హామీలు ఇచ్చి ఒక హామీ కూడా నేరవేర్చలేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు మళ్లీ ప్రజలను మోసం చేయడానికి ఉచితహామీలు ఇచ్చి అధికారం కోసం ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శించారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు ద్వారకనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, నాయకులు ఆడపశేషు, పోకల అశోక్‌కుమార్, అంజూరు శ్రీనివాసులు, బలిజసంఘ నాయకులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సంక్రాంతి సంబరాలు



వి.కోట, జనవరి 7: వి.కోట బాలికల వసతి గృహంలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు చేసుకున్నారు. వార్డెన్ ఉమాదేవి ఆధ్వర్యంలో భోగి మంటలు వేస్తూ, గొబ్బియళ్ళు ఆడుతూ, గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

తెలుగు పండితులకు సన్మానం



వి.కోట, జనవరి 7: రాజమండ్రిలో నిర్వహించిన రెండవ అంతర్జాతీయ తెలుగు మహాసభలో వి.కోటకు చెందిన తెలుగు పండితులు పాల్గొని వారి కవితలు సభలో వినిపించారు. వికోట బాలుర ఉన్నతపాఠశాల తెలుగు పండితురాలు డాక్టరు శాంతకుమారి, సి.ఎల్లాగరం ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ కొఠారి వెంకటరత్నం గోదావరి కవితా గానలహరిలో పాపికొండల నౌకావిహార కవితా గానంగా రెండు కవితలు వినిపించారు.

మండల వక్కలిగ సంఘం అధ్యక్షుడిగా మునేగౌడు

శాంతిపురం, జనవరి 7 : మండల టీడీపీ వక్కలిగ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మునేగౌడును ఆదివారం పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, కుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు విశ్వనాథ్‌నాయుడు, నాగరాజు, విజయరామిరెడ్డి, ఎఎంసి నాగరాజు, ఆర్‌ఎస్ మణి, ఉయ్యాల జయరామిరెడ్డి, చలపతి, రాజేంద్ర, శవకుమార్, అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

పలమనేరు : స్థానిక బీసీ వసతి గృహం విద్యార్థులకు ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు గ్రంథాలయ పుస్తకాలను అందజేశారు. పలమనేరు, గంగవరం ఎంఈవోలు లీలారాణి, వేణుగోపాల్‌రెడ్డి, బీసీ వసతి గృహ అధికారి సోమసుందరం రెడ్డి పాల్గొన్నారు.

నిరంకుశ చట్టాలు ప్రయోగిస్తే భరతం పడతాం



కుప్పం, పలమనేరులలో ఎస్మా జీవో ప్రతుల దహనం, పుంగనూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

కుప్పం, జనవరి 7: పాలకులు నిరంకుశమైన చట్టాలను ప్రయోగిస్తే భయపడేది లేదని, పైపెచ్చు ఎదురుతిరిగి భరతం పడుతామని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కుప్పంలో అంగన్వాడీల ఉద్యమం అంతకంతకూ తీవ్రరూపం దాలుస్తోంది. డిమాండ్ల సాధనకోసం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు, ఆదివారం తమపై ఎస్మా చట్టం ప్రయోగిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు రాసిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత, ఇతర అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య రీతులలో నిరసన తెలుపుతున్న తమపై ఎస్మా చట్టం ప్రయోగిస్తూ జీవో విడుదల చేయడం దేశంలోని ఎమర్జన్సీ చీకటి రోజులను మించిపోయిందని ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. కాగా కుప్పంలో కొనసాగుతున్న అంగన్వాడీ దీక్షలకు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఆదివారం దీక్షా శిబిరం సందర్శించి ఉద్యమిస్తున్న అంగన్వాడీలను పరామర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే అధినేత చంద్రబాబు సామరస్య పరిష్కారానికి ప్రయత్నిస్తారని హామీ ఇచ్చారు.

పలమనేరు : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆదివారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. వారు మాటాడుతూ తమ కోర్కెలు పరిష్కరించాలని డిమాండు చేశారు. యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, జోతి, శాంతి, భారతి, సరస్వతి, పాల్గొన్నారు.

శాంతిపురం: అంగన్వాడీలకు పంపిణీ చేసి ఎస్మా జీవో కాపీలను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రామకుప్పం, శాంతిపురం మండలాల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. ఆదివారం పుంగనూరు ఐసీడీఎస్ కార్యాలయం ముందు వారు నిరసన తెలిపారు. వారు మాట్లాడుత అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. అత్యవసర శాఖలపై ఉపయోగించే చట్టాన్ని తమపై ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. అంగన్వాడీ కార్యకర్తలు రెడ్డెమ్మ, ప్రమీళ, రమణమ్మ, సునీత, విజయకుమారి, అర్చన, మల్లీశ్వరి, లక్ష్మిదేవి, మంగమ్మ పాల్గొన్నారు.

జగన్ వంటి దౌర్భాగ్య సీఎం దేశంలోనే లేరు

మాజీ మంత్రి అమరనాథరెడ్డి



ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి7 : జగన్ వంటి దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి ఏ రాష్ట్రంలోనూ లేరని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లి పంచాయితీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత చిన్నాన్న హత్యకు గురైతే ఎవరు, ఎందుకు హత్యచేశారో చెప్పుకోలేకపోతున్నారని, సొంత చెల్లెలు మరో పార్టీలో చేరిపోయారని, చివరకు రాష్ట్రానికి రాజధాని ఏది అని చెప్పుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాలుగున్నర ఏళ్ల జగన్ పరిపాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీని గెలిపిస్తే చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. లక్కనపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కిషోర్‌గౌడు, సుబ్రమణ్యంశెట్టి, రఘుచంద్రగుప్తా, దివాకర్‌రెడ్డి, భువనచంద్రగౌడు, అరుణ్, శ్రీనివాసులు మూర్తి, పళని, అమరనాథరెడ్డి, మహిళావిభాగం నాయకురాళ్లు శివకుమారి, జయమ్మ, ధనలక్ష్మి, జనసేన నాయకులు దిలీప్‌కుమార్, చైతన్యలతోపాటు జనసైనికులు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందాలంటే టీడీపీని గెలిపించాలి



గ్రామాల్లో పర్యటిస్తున్న చల్లా బాబు తదితరులు

పుంగనూరు రూరల్, జనవరి7: పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే తెలుగుదేశంపార్టీని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు భాస్కర్ కోరారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మంగళం, కృష్ణమరెడ్డిపల్లె, చల్లావారిపల్లె, గెరిగిపల్లె, కంగానెల్లూరు, జెట్టిగుట్లపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో వైసీపీ నాయకులకు అనుకూలంగా అధికారులు పనులు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు ఆరోపించారు. పేద వారికి ఒక రకమైన కొలతలు, వైసీపీ నాయకుల ఇళ్ల, దుకాణాలు ఉన్న చోట మరో కొలతలు చూపి భవనాలు కూల్చి వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ ఒక రకమైన న్యాయం చేయాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగరాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, ఆసూరి బాలాజీ, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, దేశాధి ప్రకాశ్, బీమాదవ, సంజీవ, సోము, రమేశ్, హరి, వెంటరమణ, మురగ, రాంబాబు, గోపి, గంగధర్, వెంకటస్వామి, చెన్నకేశవులు, బుజ్జిప్రసాద్‌స్వామి, నాగరాజ, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, నరేశ్‌రాయల్, హరినాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష మెజారిటీయే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్సీ కంచర్ల



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, జనవరి 7: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు కుప్పం నియోజకవర్గంలో ఈసారి లక్ష మెజారిటీ తెప్పించడమే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్తా, నాయకుడూ పనిచేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. బెంగళూరులో ఆదివారం జరిగిన టీడీపీ ఫోరమ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రతిఒక్కరూ పది మందితో చంద్రబాబుకు ఓటేయించాలని కోరారు. చంద్రబాబు కుప్పం నియోకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేసే ఏకైక నాయకుడు చంద్రబాబేనని తెలిపారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బెంగళూరులో నివశిస్తున్న కుప్పం ప్రజలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు వెరిఫికేషన్

రామకుప్పం : నా బూత్-నా బాధ్యత కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు ఓటరు వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగు రైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. ఆదివారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ కోర్డినేటర్లు, గ్రామ సాధికార సభ్యులందరూ సమిష్టిగా ఓటరు వెరిఫికేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పట్రనారాయణ, క్లస్టర్‌ఇన్‌చార్జి రఫి, మండలతెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, యూనిట్ ఇన్‌చార్జిలు సీతాపతి, రామమూర్తి, గంట్లప్పగౌడు, గజేంద్ర, వెంకటరమణ, మునిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడికి ఘన సన్మానం



పుంగనూరు, జనవరి7: పుంగనూరు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడుగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కె.బాలసుబ్రహ్మణ్యం దంపతులను ఆర్యవైశ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన సర్వసభ్యసమావేశంలో సభ్యులు నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని చెప్పారు. సమావేశంలో వాసవిక్లబ్, వనితక్లబ్, లయన్స్‌క్లబ్ అనుబంధ సంఘ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

వి.కోట, జనవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. మూడు రాష్ట్రాల కూడలి వి.కోటలో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నిర్మూలించేందుకు సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రమాదాలకు చాలావరకు అతివేగమే ప్రధాన కారణమని, వేగాన్ని నియంత్రించుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చన్నారు. అలాగే వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు విధిగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. మలుపుల్లో రోడ్డుకు ఇరువైపులా ముళ్ళపొదలు, చెట్లు తొలగించారు. పలమనేరు రోడ్డు, పేర్నాంబట్ రోడ్డు, కుప్పం రోడ్డు, కేసీఏఫ్ రోడ్డు ప్రధాన కూడళ్లలో ప్రమాదాలు సూచించే బోర్డులను ఏఎస్ఐ జయకృష్ణ నేతృత్వంలో పోలీసులు ఏర్పాటు చేయించారు.

వైష్ణవిదేవికి శాంతి పూజలు

చౌడేపల్లె, జనవరి7: పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి ఆదివారం శాంతి పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి మండలం రోజులు పూర్తి అయిన సందర్భంగా అమ్మవారికి 101 బిందెలతో మహిళలు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

కల్లూరు, జనవరి 7: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, పాతపేట పంచాయతీల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని తెలిపారు. ఆయుస్మాన్ భారత్, పీఎం సురక్ష బీమా, పీఎం జీవనజ్యోతి బీమా, అటల్ పెన్షన్ యోజన, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన తదితర పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయుస్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జానకీరావు, యల్లయ్య, సర్పంచ్ నటరాజ, ఏపీఓ షౌకత్, ఏపీఎం చంద్రమోహన్, బీజేపీ, వైసీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టీడీపీ యువకులు

రామకుప్పం, జనవరి 7 : రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన 30 మంది టీడీపీ యువ నేతలు ఆదివారం జడ్పీటీసీ నితిన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. వైసీపీలో చేరిన వారిలో కిరణ్‌కుమార్, రంజిత్, చరణ్, విజయకుమార్, మురళీ, ఎస్.రవి, కె.బాబు, కార్తీక్, మంజునాథ్, హరిప్రసాద్, మునిరాజు, నవీన్‌చంద్, శవకుమార్, విజయ్, నాగరాజు, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, మండల యువజన విభాగ అధ్యక్షుడు యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



పుంగనూరు రూరల్, జనవరి7: మంగళం పంచాయతీ చెలిమిగడ్డకు చెందిన వెంకటేశ్ కుమారుడు శంకర్(15)కు మతిస్థిమితం సక్రమంగా లేదని, ఉదయం నుంచి కనిపించలేదని శంకర్ తల్లి దాక్షయణి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ సుకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ ఆర్థిక సాయం

రామకుప్పం, జనవరి 7 : ననియాలకు చెందిన టీడీపీ వీరాభిమాని నీలమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి యూనిట్ ఇన్‌చార్జిలు రామూర్తి, గజేంద్ర, నేతలు మనోహర్, కామరాజ్‌నాయక్, వేణునాయుడు, వెంకటేష్ తదితరులు నీలమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబానికి పార్టీ తరుపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

65 మందికి నేత్రపరీక్షలు



పలమనేరు, జనవరి7 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్రచికిత్సా శిబిరంలో 65 మందికి శంకరనేత్రాలయ నేత్రవైద్యులు మురళి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 25 మందికి ఆపరేషన్లు అవసరమున్నట్లు గుర్తించారు. ఆపరేషన్లు చేసుకొనే వారిని చెన్నై శంకరనేత్రాలయ ఆసుపత్రికి తీసుకు వెళ్ళి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మురళి తెలిపారు. చెన్నై రాను పోను ఉచిత వాహన సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పలమనేరు, జనవరి7 : పలమనేరు మండలం కూర్మాయి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను ప్రబోధ సేవాసమితి సభ్యులు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి వారు భగవద్గీత జ్ఞానం ప్రకారం సంక్రాంతి అంటే మనిషిలోని దుర్గుణాలపై తిరుగుబాటు అని, సుఖ, భోగ వాంఛలను అగ్నికి ఆహుతి చేయాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు బాస్కర్, బాలాజి, సభ్యులు హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ, డి.బాలాజి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



కుప్పం, జనవరి 7: అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఆదివారం బీజేపీ నాయకులు కుప్పం పట్టణం శేఖర్ నగర్‌లో గల వీరాంజనేయస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అక్షింతలను భక్తులకు పంచిపెట్టారు. టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, బీజేపీనాయకులు తులసీనాథ్, అనంత్ పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జనవరి7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఉదయాన్నే వేదపండితులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు. అలాగే కొండ కింద ఉన్న బోరును పుంగనూరు ఎస్‌వీజీ బోర్‌వెల్స్ యజమానులు చంద్ర, గురుప్రసాద్‌లు ఉచితంగా రీబోర్ చేయటంతో వారికి ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి శాలువాలతో సన్మానించారు.

పలమనేరులో చెకుముకి పోటీలు

పలమనేరు, జనవరి7 : పలమనేరు బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక చెకుముకి పోటీలు నిర్వహించారు. 50 టీంలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో గోనుగూరు ఉన్నత పాఠశాల, కుప్పం, ఇంపాల్స్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ (పుంగనూరు) విద్యార్థులు రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక అయ్యారు. వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఫిబ్రవరి 10,11 తేదీల్లో చిలకలూరిపేటలో ఈ పోటీలు వుంటాయని జేవీవీ నాయకులు తెలిపారు. జిల్లా జేవీవీ అధ్యక్షుడు గిరిధరమూర్తి, ప్రధానకార్యదర్శి బాలచైతన్య, పలమనేరు ఎంఈవో లీలారాణి, గంగవరం ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, జేవీవీ నాయకులు యుగంధర్‌బాబు,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సోమలలో బలిజల ర్యాలీ

సోమల, జనవరి 7: పుంగనూరులో కృష్ణదేవరాయుల క్యాంస విగ్రహావిష్కరణ సందర్భంగా ఆదివారం సోమల మండలం నుంచి అధిక సంఖ్యలో బలిజ వర్గీయులు ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. సోమల బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కుసుమ, వైస్‌ఎంపీపీ ప్రభాకర్, సర్పంచులు కేవీ రమణ, సౌజన్య, ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ, అమాస మోహన్, గంగాధరం రాయల్, మధు, వీవీ రమణ, వాసుదేవకుమార్, బాలసుబ్రహ్మణ్యం, సాంబశివయ్య, జగన్, డిసెంబర్‌రావు పాల్గొన్నారు.

కంటి పరీక్షలకు విశేష స్పందన

చౌడేపల్లె, జనవరి7: స్థానిక హైస్కూల్‌లో 1977-78లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి పరీక్షల శిబిరానికి విశేష స్పందన లభించింది. 310 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 152 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అలాగే బాలసముద్రంలో నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శికిత్స శిబిరానికి కూడా స్పందన లభించింది.

నంజంపేట హైస్కూల్ స్వర్ణోత్సవాలు ప్రారంభం



సోమల, జనవరి 7: మండలంలోని నంజంపేట ఉన్నత పాఠశాలలో స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఈనేపథ్యంలోనే పూర్వ విద్యార్థుల క్రికెట్ పోటీలను హెచ్‌ఎ. కుసుమాంబ, విశ్రాంత హెచ్‌ఎం రంగారెడ్డి జ్యోతి వెలిగించారు. ఈనేపథ్యంలోనే పలు కార్యక్రమంలో నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు వసంతకుమారి, రాజేష్, గాయత్రి, శ్రీదేవి, పూర్వ విద్యార్థులు మునీశ్వరరావు, లోకేశ్, గోపీనాయక్, అనూబేగ్ తదితరులు పాల్గొన్నారు.

రుయాలో ప్రైవేటు అంబులెన్స్‌ల హల్‌చల్

● ఒక్కో వాహన అనుమతికి రూ.వంద వసూలు



పగలు ఆస్పత్రి ముందు పార్కింగ్ చేసివున్న ప్రైవేటు అంబులెన్సులు - రాత్రిపూట రుయాస్పత్రి ఆరవణలో ఆగివున్న ప్రైవేటు అంబులెన్సులు

తిరుపతి సిటీ, జనవరి 7: రుయాస్పత్రి ప్రైవేటు అంబులెన్సులకు అడ్డాగా మారుతోంది. ఆస్పత్రి ఆవరణలో ప్రైవేటు అంబులెన్సులను నిలపరాదని అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్నారు. పగలంతా ఆస్పత్రి ముందే నిలిపివుండే వాహనాలు చీకటిపడితే ఆస్పత్రి ఆవరణలోకి చేరిపోతున్నాయి. సాయంత్రం 6 గంటల తర్వాత అడిగే వారు లేకపోవడంతో అత్యవసర విభాగం ముందు పార్కింగ్ చేసేస్తున్నారు. అడ్డుకోవాల్సిన సిబ్బంది ఒక్కో అంబులెన్సుకు రూ.వంద లెక్కన తీసుకుని అనుమతిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ప్రైవేటు అంబులెన్సుల నిర్వాహకులు నేరుగా వార్డుల్లోకి వెళ్లి రోగులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు. దీనికితోడు రాత్రిళ్లు బయటి నుంచి వచ్చే ఇతర ప్రైవేటు వాహనాలను లోపలకు అనుమతించకపోతుండడంతో వీరు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నికల విధులు - బదిలీలకు అవకాశం

● ఉద్యోగుల వివరాల సేకరణలో జిల్లా యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల వివరాలు ఖజానా శాఖ నుంచి సేకరించే కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణతో సంబంధం ఉన్న అధికారులు, ఉద్యోగులను ప్రస్తుతం పని చేస్తున్న జిల్లా నుంచి బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గడచిన నాలుగేళ్లలో మూడేళ్ల పాటు ఒకే జిల్లాలో పనిచేసివుంటే వారిని ఇక్కడి నుంచి మార్చాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. 2024 జూన్ 30 నాటికి చిత్తూరు జిల్లాలో మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకోబోయే వారికి ఈ జిల్లాలో పోస్టింగ్ ఇవ్వవద్దని పేర్కొంది.

జాబితా తయారీలో నిమగ్నం

కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల నేపథ్యంలో జిల్లా అధికారులు శాఖల వారీగా బదిలీకి అర్హులైన అధికారులు, సిబ్బంది జాబితా తయారీలో యంత్రాంగం గత వారం రోజులుగా తలమునకలయ్యారు. జిల్లావ్యాప్తంగా అన్నిశాఖల ఉన్నతాధికారులకు వారి శాఖల్లో మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారి వివరాలు ఇవ్వాలని కలెక్టరేట్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. మరో వైపు సమగ్ర వివరాలు ఇవ్వాలని జిల్లా ఖజానాశాఖకు సైతం ఆదేశాలిచ్చాయి.

ప్రధానంగా ఈ అంశాలు

అధికారి సొంత జిల్లా, ఈ జిల్లాలో ఎన్నాళ్లనుంచి పని చేస్తున్నారు, ఎప్పుడు ఉద్యోగ విరమణ చేయనున్నారు, వారిపై ఏమైనా క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉన్నాయా తదితర అంశాలన్నీ బదిలీల జాబితాలో కీలకంగా మారబోతున్నాయి. కాగా బదిలీలు పాత ఉమ్మడి చిత్తూరు జిల్లావారీగా చేపడతారా లేక విభజన అనంతరం ఏర్పడిన తిరుపతి, అన్నమయ్య నూతన జిల్లాలవారీగా నిర్వహిస్తారా అనే విషయంపై ఇప్పటికి స్పష్టత రాలేదని సమాచారం.

రెవెన్యూ కీలకం : ఎన్నికల విధుల్లో కీలకమైన రెవెన్యూలో లోతైన కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన తహసీల్దార్ స్థాయి అధికారుల జాబితా పెద్దగానే ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు కలెక్టరేట్, మండలాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

వీరికి మినహాయింపు : ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉండి ఆరునెలల వ్యవధిలో విరమణ చేయనున్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేయవద్దని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరికి ఏవిధమైన ఎన్నికల విధులు కేటాయిస్తారో తెలియడం లేదు.

ఇతర శాఖల్లో

పోలీసు శాఖలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్, ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న వారు ఎక్కువగా స్థానికులై ఉన్నారు. జిల్లాపరిషత్‌లో ఎంపీడీవోల బదిలీలు తరచూ జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ వంటి శాఖల్లో పాలకపక్ష నేతల ఆశీస్సులతో అనేక సంవత్సరాలుగా ఇక్కడే ఉండి విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు ఎక్కువగానే ఉన్నారు. వీరు ఎన్నికల బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లక తప్పదని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇదేం బరితెగింపు..!

శ్రీకాళహస్తిలో కొందరు అధికార పార్టీ నేతలు అక్రమాలతో చెలరేగిపోతున్నారు. పట్టణ పరిధిలోని స్వర్ణముఖి నదిలోకి చొరబడి మట్టి, ఇసుకను కొల్లగొట్టారు. భారీ యంత్రాలు, టిప్పర్లతో బాహాటంగా తవ్వకాలు చేయడాన్ని చూసిన వారంతా ఇదేం బరితెగింపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


నదిలోకి అక్రమార్కులు వేసిన రోడ్డు


ప్రైవేటు స్థలంలోకి డంపింగ్


యంత్రాలతో జోరుగా తవ్వకాలు

నదిలోకి దర్జాగా రోడ్డు ఏర్పాటు

భారీ యంత్రాలు పెట్టి మట్టి, ఇసుక తరలించేసిన అధికార పార్టీ నేతలు

శ్రీకాళహస్తిలో స్వర్ణమ్మ శోకం

శ్రీకాళహస్తి జనవరి 7: ముక్కంటి భక్తులు ఎంతో పవిత్రంగా ఆరాధించే స్వర్ణముఖి నదిలో ఎన్నో ఏళ్ల క్రితమే ఇసుక తవ్వకాలను నిషేధించారు. నిబంధనలతో తమకేం పని అనుకున్నారేమో.. కొందరు అధికార పార్టీ నేతలు ఏకంగా నదిలో అనధికారిక రోడ్డును నిర్మించారు. ఆపై ప్రైవేటు వెంచర్ కోసం నదిలోని మట్టి, ఇసుకను భారీ యంత్రాలతో దర్జాగా తవ్వి తరలించారు.

అధికారం అండతోనే..

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక నది ఒడ్డున ప్రైవేటు భూమి ఉంది. ఇందులో వెంచర్ వేయడానికి కొందరు అధికార పార్టీ నేతలు కసరత్తు ప్రారంభించారు. అధికారం అండగా ఉండడంతో.. ఎవరు అడ్డుకుంటారన్న ధీమాతో రెండ్రోజుల నుంచి క్రషర్ దుమ్ముతో నదిలోకి రోడ్డు వేశారు. ఆదివారం భారీ యంత్రాలతో నదిలోకి చొరబడి యథేచ్ఛగా తవ్వకాలు సాగించారు. స్థానికుల సమాచారంతో ఆంధ్రజ్యోతి అక్కడికి వెళ్లి ఫొటోలు తీసింది. నదిలో మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తున్న యంత్రాల మధ్య ముక్కంటి ఆలయం రాజగోపురం కూడా స్పష్టంగా కనిపిస్తుండటం గమనార్హం. ఆంధ్రజ్యోతి వచ్చిన విషయం తెలుసుకున్న అక్రమార్కులు వెంటనే అక్కడి నుంచి ఉడాయించారు.

నేడు విజయవాడకు కలెక్టర్, ఎస్పీ పయనం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: త్వరలో జరిగే సాధారణ ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 9వ తేదీన రాష్ట్రానికి రానుంది. ఈనేపథ్యంలో 9, 10 తేదీల్లో విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో కలెక్టర్లు, జిల్లా ఎస్పీలతో సమావేశం జరుగుతుంది. ఇందులో పాల్గొనేందుకోసం సోమవారం కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి బయలుదేరి వెళ్తున్నారు. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి తీసుకొనే చర్యలపై వీరు కేంద్ర ఎన్నికల సంఘ అధికారులకు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి


రవీంద్రబాబు (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, జనవరి 7: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని మినీ వ్యాన్ ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మండలంలోని కె. మోటకంపల్లె గ్రామానికి చెందిన రవీంద్రబాబు (61) బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయన శనివారం రాత్రి స్వగ్రామానికి వస్తూ కొత్తకోట సమీపాన గల ఓ హోటల్ వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చిత్తూరు వైపుగా వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొంది. దీంతో రవీంద్రబాబు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్‌భూపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం స్థావరంపై దాడి

ఏడుగురిపై కేసు - 15 కోళ్లు, రూ.46 వేలు స్వాధీనం

గుడుపల్లె, జనవరి 7: మండల పరిధి పెద్దభజనవాడ గ్రామ సమీపంలోని మామిడి తోపులో ఉన్న కోడి పందెం స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 కోళ్ళు, రూ.46 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

నాటుసారా తాగి మదనపల్లెవాసి మృతి



పుంగనూరు రూరల్, జనవరి7: నాటుసారా తాగి మదనపల్లెవాసి మృతి చెందిన ఘటన ఆదివారం పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... సుగాలిమిట్ట గ్రామ సమీపంలో అతిగా నాటుసారా తాగి స్పృహ కోల్పోయి పడి ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది. పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

ఏపీపీఎస్‌టీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం


కొత్త కార్యవర్గ ప్రతినిధులకు నియామకపత్రాన్ని అందిస్తున్న మోహన్‌బాబు

తిరుపతి(విద్య),జనవరి 7 : స్థానిక టీపీఎం పాఠశాలలో ఏపీ ఫిజికల్‌సైన్స్ టీచర్స్ ఫోరమ్(ఏపీపీఎస్‌టీఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ టి.మోహన్‌బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కేడీ సారథి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.మోహన్ నాయుడు, కె.మేఘనాథ్, ఉపాధ్యక్షులుగా పి.రవి, ఆర్థిక కార్యదర్శిగా టి.మనోహర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎస్.కోదండపాణి, కె.రాజేష్‌బాబు, మహిళా కార్యదర్శులుగా ఎన్.సౌజన్య, కె.రాధారాణి, సంయుక్త కార్యదర్శులుగా డి.ధనంజయ, ఎ.మోహన్, డివిజనల్ కార్యదర్శులుగా కె.వెంకటేశ్వర, ఎస్.గజరాజన్, ఎం.సుబ్బరామయ్య, బి.రాజ్‌కుమార్, పి.కోటేశ్వరరావు, చెంగల్వరాయలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు నియామకపత్రాన్ని అందించి అభినందించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన టీచర్లు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

చిత్తూరు, జనవరి 7: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి కలెక్టర్, ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరిస్తారన్నారు. సమస్యలను విన్నవించుకునేందుకు వచ్చేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ఎస్పీ కార్యాలయంలో..: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

అమ్మగారిపల్లెలో జల్లికట్టు



పాకాల, జనవరి 7: మండలంలోని కె.వడ్డేపల్లె పంచాయతీ అమ్మగారిపల్లెలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. కోడెగిత్తలను అలంకరించి కొమ్ములకు బహుమతులు కట్టి వీధుల్లో పరుగులు తీయించారు. కోడెగిత్తలను నిలువరించి బహుమతులు దక్కించుకోవడానికి యువత వాటి వెంట పరుగులు తీశారు. జల్లి కట్టు తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు అమ్మగారిపల్లెకు వచ్చి సందడి చేశారు.

చిత్తూరుకు చేరిన డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు



కలెక్టరేట్‌కు చేరిన డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు - స్కానింగ్ చేస్తున్న పోస్టల్ ఉద్యోగి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 7: ఓటర్లకు పంపిణీ చేసేందుకు కొత్త డిజిటల్ ఎపిక్ (ఓటరు) గుర్తింపు కార్డులు రెండ్రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చేరాయి. నాలుగో విడతగా 80వేల ఎపిక్ కార్డులను ఎన్నికల సంఘం పంపింది. మూడు విడతల్లో ఇదివరకు 79వేల కార్డులు అందాయి. కలెక్టరేట్‌లోని జిల్లా ఎన్నికల విభాగానికి అందిన ఎపిక్ కార్డుల స్కానింగ్ ప్రక్రియను ఐదుగురు రెవెన్యూ సిబ్బంది చేపడుతున్నారు. మరోవైపు తపాలాశాఖ సిబ్బంది స్కానింగ్ చేపట్టారు. వీటిని తపాలాశాఖ ద్వారా రిజిష్టర్ పోస్టులో ఓటర్ల ఇళ్లకే పంపిస్తామని డీఆర్వో రాజశేఖర్ తెలిపారు. ఒకవేళ పోస్టల్ చిరునామా తప్పుగా వుంటే వాటిని సచివాలయ వలంటీర్ ద్వారా ఓటరుకు అందజేస్తామన్నారు. గతంలో పాత ఓటరు గుర్తింపుకార్డులపై 14 అంకెల సంఖ్య ఉండేది. ఇప్పుడు జారీ అవుతున్న కొత్త ఎపిక్ కార్డుల్లో 10 అంకెలు (తొలి మూడు ఆంగ్ల అక్షరాలు, మిగిలిన ఏడు అంకెలు) ఉన్నాయి. ఒక్కొక్క నియోజకవర్గానికి ప్రత్యేకంగా మూడు ఆంగ్ల అక్షరాలు, ప్రత్యేక సిరీస్ ఉంటుంది.

యువతిని కత్తితో బెదిరించి దోపిడీ

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 7 : జాతీయ రహదారిలో నిర్మానుష్య ప్రాంతంలో వాష్‌రూమ్‌కు వెళ్లిన యువతిని ఇద్దరు దుండగులు కత్తితో బెదిరించి బంగారు ఉంగరాలు, సెల్‌ఫోన్లు కాజేసిన విషయంపై ఆదివారం తిరుపతి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. చంద్రగిరి డీఎస్పీ డాక్టర్ యశ్వంత్, రూరల్ ఎస్సై నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరుకు చెందిన మాధవి తిరుపతిలోని ఓ పీజీ హాస్టల్లో ఉంటూ సీఏ కోర్సు చదువుతోంది. పుంగనూరుకు చెందిన సిమెంట్, స్టీల్ వ్యాపారి దేవకుమార్ శనివారం తిరుపతికి వచ్చి తిరుగు ప్రయాణంలో మాధవిని తనతో పాటు ఆయన కారులో తీసుకువెళ్లాడు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో వెళుతుండగా మాధవి వాష్‌రూమ్‌కి వెళ్లాలని చెప్పడంతో శ్రీవకుళమాత ఆలయ సమీపంలో దేవకుమార్ కారును ఆపారు. ఆ పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రాంతంలోకి మాధవి వెళ్లింది. ఇద్దరు దుండగులు మాధవి దగ్గరకు వెళ్లి కత్తితో బెదిరించి ఆమె వద్ద ఉన్న బంగారు ఉంగరాలు కాజేశారు. అంతటితో ఆగక ఆమెను కారు వద్దకు తీసుకువచ్చి అదే కారులో మాధవి, దేవకుమార్‌ను కిడ్నాప్ చేసి భారీ మొత్తంలో నగదు కాజేసేందుకు నేంద్రగుంట వైపు తీసుకువెళ్లారు. కారు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే అందులో ఉన్న మాధవి కిందకు దూకేసి పెద్దగా కేకలు వేయడంతో ఆ ఇద్దరు దుండగులు కారు దిగి పారిపోయారు. ఈ మేరకు బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు టోల్‌గేట్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దోపిడీకి పాల్పడిన వారు 25 ఏళ్లలోపు యువకులుగా గుర్తించారు. వీరిని త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ స్టాఫ్ పోటీలు



షీల్డ్ అందుకుంటున్న టెన్నిస్ డబుల్స్ విజేతలు ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ పి.మదుసూధన్‌రెడ్డి - షీల్డ్ స్వీకరిస్తున్న ఉమెన్ విన్నర్స్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 7: ఎస్వీయూ ఇంటర్ కాలేజీయేట్ మెన్ అండ్ ఉమెన్ స్టాఫ్ పోటీలు ఆదివారం హోరాహోరీగా జరిగాయి. టెన్నిస్ డబుల్స్‌లో ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి విజేతలుగా నిలిచారు. మెన్స్ విభాగంలో బ్యాడ్మింటన్ సింగిల్ అండ్ డబుల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) విజేతగా సీకాం డిగ్రీ కాలేజ్(కలికిరి) రన్నరప్‌గా నిలిచింది. టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో ఎస్వీయూ కాలేజ్(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. బాల్ బ్యాడ్మింటన్(మెన్)లో టీఎస్ఆర్ డిగ్రీ కాలేజీ(తిరుపతి) విజేతగా ఎస్వీయూ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. చదరంగంలో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) గెలుపొందగా కుప్పం డిగ్రీ కాలేజీ(కుప్పం) రన్నరప్‌గా నిలిచింది. ఉమెన్స్ విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్‌లో ఎస్వీయూ(తిరుపతి) విజేతగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది. త్రోబాల్‌లో ఎస్వీయూ కాలేజీ(తిరుపతి)గెలుపొందగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ(తిరుపతి) రన్నరప్‌గా నిలిచింది.

అదృశ్యమైన బాలిక మృతి

హత్యగా భావిస్తున్న మృతురాలి తల్లిదండ్రులు

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



సోనికుమారి (ఫైల్ ఫొటో) - అనుమానితుడు బాలకిషోర్

చంద్రగిరి, జనవరి7: చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె వద్ద జగనన్న కాలనీలో ఈనెల 2న అదృశమైన ఆరేళ్ల బాలిక.. సమీప అటవీ ప్రాంతంలో ఆదివారం శవమై కనిపించింది. పోలీసుల కథనం మేరకు... జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీ కోసం జార్ఖండ్ నుంచి కొంత మంది కార్మికులను పదిరోజుల క్రితం కాంట్రాక్టర్ మధుకర్‌రెడ్డి పిలిపించారు. కార్మికులలో ఒకరైన రాజేష్‌నాయక్ తన కుమార్తె సోనికుమారి(6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకొంటూ కనిపించకుండా పోయిందని ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం జగనన్న కాలనీ సమీప అటవీ ప్రాంతంలో సోనికుమారి మృతదేహం లభ్యమైంది. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. అయితే మృతురాలి తల్లి మాట్లాడుతూ తన కుమార్తె సోనికుమారి అదృశ్యమైన రోజు జార్ఖండ్‌కు చెందిన బాలకిషోర్‌పై అనుమానం వచ్చి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించామని, అయితే పోలీసులు బాలకిషోర్‌ను వదిలిపెట్టేసారని చెప్పారు. గత గురువారం బాలకిషోర్ తన కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడని తెలిపారు. పోలీసుల నిర్లక్ష్యం వలనే తన కుమార్తె హత్యకు గురైందని వెల్లడించారు.

బాలిక మృతదేహాన్ని పరిశీలించిన పులివర్తి నాని

టీడీపీ నేత పులివర్తి నాని ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గంజాయి బ్యాచ్ వలనే ఈ దారుణం చోటు చేసుకుందని, చంద్రగిరి నియోజకవర్గం గంజాయి హబ్‌గా మారిందన్నారు. గంజాయి మత్తులోనే అభం శుభం తెలియని బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పేర్కొన్నారు. గతంలో చంద్రగిరిలో ఓ బాలికకు గంజాయి విక్రయిస్తూ ఎమ్మెల్యే బ్యాచ్ పట్టుబడ్డారని, నారావారిపల్లె సర్పంచ్ భర్తపై దాడి, భీమవరం టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిపై గంజాయి బ్యాచ్ దాడులు చేశారని గుర్తుచేశారు. వరుస ఘటనలు జరుగుతున్నా చంద్రగిరి పోలీసులు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రాజేష్‌నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు


సీఆర్ రాజన్ - భీమనేని చిట్టిబాబు

చిత్తూరుసిటీ/వెదురుకుప్పం, జనవరి 7: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు లభించింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని తిరుచానూరుకు చెందిన సీఆర్ రాజన్, పాలసముద్రం మాజీ జడ్పీటీసీ, ప్రభావశీలుల గుర్తింపుకమిటీ సభ్యుడు భీమనేని చిట్టిబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని చిట్టిబాబు చెప్పారు.

వరిలో జింక్ లోపాన్ని నివారించండి


జింక్‌లోప లక్షణాలతో ఉన్న వరిపైరు

తిరుపతి(విద్య), జనవరి 7: రబీలో వరి పైరుకు జింక్ తక్కువయితే దిగుబడిపై ప్రభావం చూపుతుందని, పైరు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేసేందుకు జింక్ చాలా అవసరమని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఈశాన్య రుతుపవన వర్షాలు ఆలస్యం కావడం వల్ల చాలా మంది రైతులు దుక్కిలో జింక్ ఎరువును సిఫారసుల మేరకు వేయలేకపోయారని, దాంతో వరిలో ఈ లోపం ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. సున్నం, చౌడు, భాస్వరం ఎక్కువ ఉన్న భూముల్లో మొక్కలకు జింక్ సరిగా అందదని, మురుగునీరు బయటకుపోని పల్లపు ప్రాంతాలలో కూడా జింక్ లోపం ఎక్కువగా కనిపిస్తుందని వివరించారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు.

● **లోప లక్షణాలు ఇలా :** వరినాటిన 2-6వారాల మధ్య లోప లక్షణాలు కనిపిస్తాయని, మొక్కల్లో పెరుగుదల మందగించి గిడసబారుతాయని పేర్కొన్నారు. పిలకలు రావడం తగ్గుతుందని, మొక్కల మధ్య ఆకులలో ఈనెల మధ్యభాగం పసుపురంగుకు మారుతుందన్నారు. ముదురు ఆకు చివర్లలో తుప్పు మచ్చలు కనిపిస్తాయని పేర్కొన్నారు. ఆకులు పెళుసుగా ఉండి వంచితే శబ్దం చేస్తూ సులభంగా విరిగిపోతాయని తెలిపారు. పొలంలో అక్కడక్కడా మొక్కలు సరిగా పెరగకుండా ఖాళీలు కనిపిస్తాయన్నారు.

● **నివారణ చర్యలు :** మురుగునీరు బయటకుపోని పొలాల్లో నాటిన రెండు వారాల తర్వాత పాతనీరు పూర్తిగా తీసేసి కొత్తనీరు అందించాలని తెలిపారు. చౌడు భూముల్లో మొదటి దఫా పైపాటుగా వేసే యూరియాకి బదులుగా అమ్మోనియం సల్ఫేట్ వేస్తే చౌడుగుణం తగ్గి జింక్ పెరుగుతుందని వివరించారు. వరిపైరులో ఈ లోప లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 2గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలని సూచించారు. చిలేటెడ్‌రూపంలో మార్కెట్‌లో దొరికే చిలామినిన్ జింకును లీటరు నీటికి గ్రాము చొప్పున కలపి అవసరాన్ని బట్టి ఒకటి రెండుసార్లు స్ప్రే చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇతర వివరాల కోసం 8331057872ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ గెలుపు కోసం ప్రవాసాంధ్రులు కృషిచేయాలి

● డాక్టర్ థామస్


థామస్‌ను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

పాలసముద్రం, జనవరి 7: పొరుగు రాష్ట్రాల్లో వున్న ప్రవాసాంధ్రులంతా అసెంబ్లీ ఎన్నికలప్పుడు తమ స్వగ్రామాలకు వచ్చి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించడానికి కృషిచేయాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ కోరారు. ఆదివారం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ప్రవాసాంధ్రులతో బెంగళూరు పద్మనాభ నగర్‌లోని శ్రీహరి కల్యాణ మండపంలో డాక్టర్ థామస్ పరిచయ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రవాసాంధ్రులు పెద్దఎత్తున పాల్గొని ఆయన్ను ఘనంగా సన్మానించారు. థామస్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రవాసాంధ్రులంతా కృషిచేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైకో పోవాలి సైకిల్ రావాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్రటీడీపీ ప్రభావశీలుల గుర్తింపు కమిటీ సభ్యులు భీమనేని చిట్టిబాబు నాయుడు, చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు, నియోజకవర్గంలోని ఆరు మండలాల టీడీపీ అధ్యక్షులు, నాయకులు గంగరాజు, రుద్రయ్య రాజు, ప్రవాసాంధ్రులు భారీఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా గుడి-బడి కార్యక్రమం


ప్రధాన ఆలయాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జనవరి 7: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం గుడి - బడి కార్యక్రమాన్ని తిరుపతికి చెందిన టీం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 120 మంది సిబ్బంది ప్రధాన ఆలయం, అనుబంధ ఆలయాలైన మణికంఠేశ్వర స్వామి, వరదరాజస్వామి ఆలయాలను శుద్ధి చేశారు. దీంతో పాటు ఆస్థాన మండపం, మాడా వీధులు, ఈవో కార్యాలయాన్ని శుభ్రం చేశారు. చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవోలు ఎస్వీకృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడికి వజ్రాయుధం సమాచారహక్కు చట్టం


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఆర్‌టీఐ నేతలు

గంగాధరనెల్లూరు, జనవరి 7: సామాన్య ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో వివరాల సేకరణకు ప్రధానంగా ఉపయోగపడేది సమాచారహక్కు చట్టమేనని తహసీల్దార్ ఇన్బనాథన్ పేర్కొన్నారు. జాతీయ సమాచారహక్కు చట్టం(ఆర్‌టీఐ) యూనియన్ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, రాష్ట్ర ఆర్‌టీఐ యూనియన్ యూత్ అధ్యక్షుడు రామ్‌రాజ్‌ల ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు రెవెన్యూ కార్యాలయం వద్ద 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్‌టీఐ యూనియన్ సలహాదారు డాక్టర్ తిలక్, జాతీయ ఉపాధ్యక్షులు మోహన్‌కుమార్, సభ్యులు రాంప్రకాష్, శ్రీనివాసులు రెడ్డి, మున్నా, పట్టాభి, జయపాల్, రత్నం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సైకో పాలననుంచి రాష్ట్రాన్ని కాపాడుదాం: టీడీపీ



మాట్లాడుతున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, జనవరి 7: రాష్ట్రాన్ని సైకో పాలననుంచి కాపాడుకునేందుకు ప్రజలందరూ కదలిరావాలని, అవినీతి, అరాచకపాలనకు ముగింపు పలికే బాధ్యత మనందరిపై ఉందని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని ఈచనేరిపల్లి, వంకరవారిపల్లె, కచ్చేటివారిపల్లె గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మురళి మాట్లాడుతూ ప్రజలందరూ టీడీపీకి పట్టంగట్టి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, గ్రామ నాయకులు శివరాజ్, సిద్ధయ్య, దొరబాబు, హరిప్రసాద్, దూర్వాసులు, శంకరయ్య, బాలయ్య, నారాయణ, దేవంత్, రాజశేఖర్, రేవంత్ పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

బంగారుపాళ్యం మండలంలోని తుంబకుప్పం దళితవాడలో వైసీపీ పార్టీకి చెందిన 20 మంది మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, తెలుగు యువత రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారికి టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బాబ్జి, వాసు, శ్రీధర్, జగన్నాథం, దిలీప్, గిరిబాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ దళిత నేత మృతి


రామమూర్తి (ఫైల్‌ఫొటో)

పూతలపట్టు, జనవరి 7: తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ దళితనేత బందార్లపల్లె రామమూర్తి అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతిచెందారు. మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ బందార్లపల్లె దళితవాడకు చెందిన రామమూర్తి (65) సీనియర్ టీడీపీ దళిత నేత. ఈయన టీటీడీలో ఉద్యోగం చేస్తూ ఇటీవల కాలంలో పదవీ విరమణ పొంది తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పనిచేశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతిచెందారు. సమాచారం అందుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళి, నాయకులు గంగారపు గోపి, దొరబాబు చౌదరి, కాంతారావు, ఆర్‌ఎస్ బాబు, నాగయ్య, దాము, హేమాద్రి, దామోదర్, వినోద్, మంజునాథ్, సునీల్, పలువురు నాయకులు, కార్యకర్తలు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పింఛన్ల పంపిణీ

శ్రీరంగరాజపురం, జనవరి 7: ఎస్‌ఆర్‌పురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన వైఎస్‌ఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ బెన్నూరాజ్, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, సర్పంచ్ హరితకుప్పయ్య, మండల కన్వీనర్ మణి, నాయకులు జనార్ధన్, బాబు, డిల్లెయ్య, విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న కఠారి హేమలత తదితరులు

చిత్తూరు, జనవరి 7: తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో ఐదో రోజుకు చేరుకుంది. కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు టీడీపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్ ఏర్పాటు చేసిన 500 భోజన ప్యాకెట్లను మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ నేత రాజశేఖర్‌లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా జైన్ దీక్షా మహోత్సవం


యోగితాజైన్‌ను ఊరేగిస్తున్న నగర జైన్ సంఘం సభ్యులు

చిత్తూరు కల్చరల్, జనవరి 7: చిత్తూరు మార్కెట్ చౌక్ సమీపంలోని శ్రీబాలాజి జ్యువెలరీస్ యజమానులు పదంరాజ్ స్వప్న జైన్‌ల కుమార్తె యోగితాజైన్ అతి చిరు ప్రాయంలోనే జైన్ సన్యాసత్వం స్వీకరించింది. ఈ మేరకు ఆదివారం యోగితాజైన్‌ను బజారు వీధి నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకిలో ఊరేగిస్తూ కట్టమంచి సూర్యప్రతాప్ కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం జైన్ మత సాధీలు యోగితాను ఆశీర్వదించి జైన్ సాధ్విగా ప్రకటించారు. ఈ సందర్భంగా జైన్ మత గురువులు, సాధీలు యోగితా మంత్రోపదేశం చేసి ఆమె ఔన్నత్యాన్ని ప్రశంసించారు. కార్యక్రమంలో నగర జైన్‌సంఘం నాయకులు, జైన్‌లు యోగితాను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

రామమందిర అక్షతల పంపిణీ


అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న వీహెచ్‌పీ నాయకులు

చిత్తూరు కల్చరల్, జనవరి 7: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు ఇంటింటా అయోధ్య రామమందిరం అక్షతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీరామభజనగుడిలో శాస్త్రోక్తకంగా రామాలయ అక్షతలకు పూజలు చేశారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి వి.వేలు, గుత్తా ప్రభాకర్ నాయుడు ఆధ్వర్యంలో చిట్టిబాబు, జయకుమార్, బాబు కిరణ్ తదితరులు ఇంటింటా అక్షతలను పంపిణీ చేశారు.

ప్రజాసేవ చేయడమే 'జీజేఎం' లక్ష్యం


చీరలు పంపిణీ చేస్తున్న చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, జనవరి 7: నిత్యం ప్రజాసేవ చేయడమే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని వసంతాపురం, బొమ్మసముద్రం అరుంధతివాడ, చుక్కావారిపల్లె గ్రామాల్లో ఓంశక్తి పూజల్లో పాల్గొని, భక్తులకు చీరలు పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటివరకు సుమారు 20 బస్సులను ఓంశక్తి యాత్రకు ఉచితంగా పంపించారు. ఆదివారం ఓంశక్తి యాత్రకువెళ్ళే బస్సులను మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సర్పంచ్ గుర్రప్ప నాయుడు, టీడీపీ నాయకులు చల్లా, బాబు, పృథ్వీ, పళని, బాబు రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుప్పావై పారాయణం

చిత్తూరు కల్చరల్, జనవరి 7: స్థానిక కోదండరామాలయంలో ఆదివారం మార్గశిర ఏకాదశి సందర్భంగా స్వామివారికి నగరంలోని శ్రీవైష్ణవ బ్రాహ్మణ సంఘం సభ్యులు తిరుప్పావైలోని ఇరవై మూడవ పాశురం సామూహికంగా పారాయణం చేశారు. ఆలయ అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యం నాయుడులు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 14న ధనుర్మాసం చివరి రోజున గోదాదేవి(ఆండాళ్ - పెరుమాళ్‌ల) కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

కేపీ అగ్రహారంలో జనం కోసం జనసేన

కార్వేటినగరం, జనవరి 7: కార్వేటినగరం మండలం కేపీ అగ్రహారంలో జనం కోసం జనసేన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు శోభన్ బాబు, నాయకులు రాఘవ, వెంకటేష్, మునిరత్నం, యతేశ్వరరెడ్డి, ప్రవంతి రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల పోటీలకు విశేష స్పందన


మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు (సెంట్రల్), జనవరి 7: ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన సౌజన్యంతో చిత్తూరులోని మిట్టూరు నాయుడు బిల్డింగ్స్‌లోని ఎన్‌పీసీ పెవిలియన్ (కల్యాణమండం) ప్రాంగణంలో ఆదివారం జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష ఆదరణ లభించింది. 76 మంది పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి, ప్రతిభ చాటుకున్నారు. ప్రాంగణమంతా ముగ్గుల రంగులతో కళకళలాడింది. గృహిణులే గాక విద్యార్థినులు పాల్గొని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. లోకల్ స్పాన్సర్‌గా ది విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని డి.బుజ్జిరావు, ద్వితీయ బహుమతిని వి.పొన్నియమ్మ, తృతీయ బహుమతిని ఎ.రాణి దక్కించుకున్నారు. ప్రోత్సాహక బహుతులను ప్రతిభ, లలిత, కళైవాణి, ప్రతిమ, రఫియ, పవ్రిత అందుకున్నారు. విజేతలకు నగరపాలక కమిషనర్ అరుణ, విజయం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ శైలజామూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌పీ వెంకటేశ్వరచౌదరి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి విజయం విద్యా సంస్థల ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. లోగోలు వేసిన రిజ్వాన, రోజాకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి షేక్ కరీముల్లా, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ మనోహరరెడ్డి, ఏడీవీటీ ఇన్‌చార్జి విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.


ముగ్గును పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


ప్రత్యేక బహుమతులు అందుకున్న ప్రతిభ, లలిత, కళైవాణి, ప్రతిమ, రఫియ, పవ్రిత

రెండో రోజుకు చేరిన అంగన్వాడీల రిలే నిరాహార దీక్ష

● ఎస్మా జీవో ప్రతుల దహనం


చిత్తూరులో, కార్వేటినగరంలో ఎస్మా జీవో ప్రతుల దహనం

చిత్తూరు, జనవరి 7: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారంతో 27వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ వద్ద బంగారుపాళ్యం, ఐరాల ప్రాజెక్టులకు చెందిన అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా అంగన్వాడీల ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమన్నారు. చెప్పిన మాట వినలేదనే కారణంతో ఆగమేఘాలపై జీవో నెంబరు-2ను తీసుకొచ్చి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రయోగాలు చేయడాన్ని మానేసి సమస్యల పరిష్కారదిశగా అడుగులు వేయాలని కోరారు. అనంతరం ఎస్మా ప్రతులను సంఘ నేతలు దహనం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు షకీలా, ఐఎఫ్‌టీయూ నేత సురేంద్రనాథ్, ఏఐటీయూసీ నేతలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నగరి: అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 2ను ఆదివారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద కార్యకర్తలు దహనం చేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వేతనాలు పెంచమని కోరితే చీకటి జీవో ద్వారా బెదిరింపులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్మా చట్టానికి సంబంధించిన జీవో ప్రతులను దహనం చేసి అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఎస్మా చట్టంతో తమ సమ్మెను ఆపలేరని, చట్టం ప్రయోగించేవారు తమ న్యాయమైన డిమాండ్లను ఎందుకుపట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెదురుకుప్పం, ఎస్ఆర్ పురం మండలాల పరిధిలో పనిచేసే అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం దృష్ట్యా విధులకు హాజరుకండి

● కార్మికులకు కమిషనర్ పిలుపు

చిత్తూరు, జనవరి 7: నగర పరిధిలోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు విధులకు హాజరుకావాలని కమిషనర్ అరుణ కోరారు. ఆదివారం అవుట్‌సోర్సింగ్, ఇంజనీరింగ్ కార్మిక సంఘ నేతలతో ప్రత్యేకంగా చర్చించారు. కార్మికుల సమ్మెనేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జ్వరాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా కార్మికులు విధులకు హాజరుకావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

● పారిశుధ్య పనుల్లో ఎన్జీవోలు, కాలనీ సంఘాలు


చెత్తను తీసుకెళుతున్న మాజీ కార్పొరేటర్ కేపీ శ్రీధర్

కార్మికుల సమ్మె నేపథ్యంలో కమిషనర్ అరుణ పిలుపు మేరకు చిత్తూరు నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి ఎన్జీవోలు, కాలనీల సంఘాలు, ప్రముఖులు, కార్పొరేటర్లు, యువత ముందుకు వస్తున్నారు. ఆదివారం నగర పాలక సంస్థతో కలిసి పలువురు పారిశుధ్య పనుల్లో భాగస్వాములు అయ్యారు. 4వ వార్డు కట్టమంచి లాయర్స్‌కాలనీలో స్థానికంగా వీధులను శుభ్రం చేశారు. కాలువల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. 35వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కేపీ శ్రీధర్ తదితరులు పారిశుధ్య పనులను నిర్వహించారు. ఐహెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో శోభారాణి, సంఘ సభ్యులు సుందరయ్యవీధిలో శుభ్రం చేశారు. పారిశుధ్య కార్యక్రమాన్ని ఏసీ గోవర్ధన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహా తదితరులు పర్యవేక్షించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 7: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన సత్యనారాయణ ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

18న వరసిద్ధుడి కానుకల లెక్కింపు

ఐరాల(కాణిపాకం), జనవరి 7: స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయ కానుకలను ఆస్థాన మండపంలో ఈనెల 18న లెక్కించనున్నట్లు చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు.

నగరిని అభివృద్ధి చేసి చూపిస్తా: భానుప్రకాష్


కార్యక్రమంలో పాల్గొన్న భానుప్రకాష్

నగరి, జనవరి 7: వైసీపీ నాయకుల తరహాలో మాటలకు పరిమితం కానని, నగరి అభివృద్ధి ఏంటో చేతల్లో చేసి చూపిస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 4, 5 వార్డుల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, మీ కోసం మీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రావాలంటే విజనరీ నాయకుడు చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని కోరారు. టీడీపీ ఆరు గ్యారెంటీలపై ప్రచారం నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు గుణశేఖర్, ఎన్.శ్రీనివాసులు, జి.అయ్యప్ప, జె.రత్నకుమార్, పద్మనాభన్, శ్రీధర్, సలీం,శేఖర్, పవన్, విజయ్‌కుమార్, ఖాదర్‌బాయ్, వికేఎస్ వాసు, మాణిక్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'స్పందన'

చిత్తూరు, జనవరి 7: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. నగరంలో సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అన్ని సచివాలయాల్లో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిత్తూరులో వైసీపీ ఖాళీ అయ్యేది ఖాయం

జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్

వైసీపీ నుంచి పార్టీలో 250 ఎస్సీ, బీసీ కుటుంబాల చేరిక



చిత్తూరు రూరల్, జనవరి 7: జనవరిలోపు చిత్తూరులోనే కాదు... రాష్ట్రంలోనూ వైసీసీ ఖాళీ అయ్యేది ఖాయమని జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ స్పష్టంచేశారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలో దిగువమాసాపల్లి పంచాయతీలో వైసీపీ నుంచి 250 ఎస్సీ, బీసీ కుటుంబాలు చంద్రప్రకాష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయనడానికి ఇదొక నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో ఈ వలసలు వేలల్లో ఉంటాయన్నారు. రానున్న ఎన్నికలో చంద్రబాబును సీఎం చేసేందుకు ప్రజలు ఆతృతగా ఉన్నారని పేర్కొన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో వలసలు పెరుగుతాయన్నారు. చిత్తూరు టికెట్టు ఎవరికి ఇచ్చినా అందరూ కలిసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం 250 కుటుంబాల వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు మాట్లాడుతూ మండంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బలంగా ఉన్నారని, అందరూ కలిసికట్టుగా టీడీపీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మంజూష్, రఘు, కోదండయాదవ్, దేవరాజులు నాయుడు, మేషాక్, కుమార్, జగదీష్ నాయుడు, రాజా, నీలకంఠం నాయుడు, శోభన్‌బాబు, జనసేన నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి సహకారం అందించండి

చిత్తూరు, జనవరి 7: చిత్తూరు నగరంలోని 20వ వార్డు అభివృద్ధికి ఐవోసీఎల్ అధికారులు సహకారం అందించాలని కార్పొరేటర్ అశోక్ కుమార్ కోరారు. ఆదివారం ఇరువారంలోని ఐవోసీఎల్ క్వార్టర్స్‌లో జరిగిన సమావేశంలో ఐవోసీఎల్ సౌత్ ఇండియన్ డైరెక్టర్ శైలేష్‌తివారిని కలిసి కార్పొరేటర్ వినతిపత్రాన్ని అందించారు. వార్డు ప్రజలు డ్రైనేజీ, పైపులైన్, కమ్యూనిటీ హాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అవసరమైన ఎస్టిమేషన్లు తయారు చేసి ఇస్తే నిధులు విడుదల చేస్తామని శైలేష్‌తివారి హామి ఇచ్చారు. ఐవోసీఎల్ అధికారులను కార్పొరేటర్ అశోక్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఏసీ గోవర్ధన్, ఐవోసీఎల్ మేనేజర్ బాలమురుగన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు రావాలి



నింద్ర, జనవరి 7: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, ప్రజల సంక్షేమంతో జీవించాలన్నా చంద్రబాబు సీఎం కావాలని మండల మాజీ తెలుగు యువత కార్యదర్శి రమేష్ అన్నారు. ఆదివారం అగరం పంచాయతీలో గడపగడపకు వెళ్లి భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కుప్పయ్య, మునస్వామి, రామూర్తి, పరంధామయ్య, పరదేశి పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగిస్తే గుణపాఠం తప్పదు


మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శాంతి

నగరి, జనవరి 7: వేతనాలు పెంచమని అడిగిన మహిళా కార్మికులపై ఎస్మా ప్రయోగించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తే రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శాంతి హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో చిత్తూరు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో మాతా శిశు సంరక్షణలో ఆశా కార్యకర్తల కష్టాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లకు వేతనాలు పెంచడంతో పాటు 2జీ ఫోన్ స్థానంలో 5జీ మొబైల్ ఫోన్లు అందించాలని, 2017వ సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న టీబీ, లెప్రసీ అలవెన్స్ మంజూరు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న సంక్రాంతి తరువాత చలో విజయవాడ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీత సుజాత, చందామరై, ఏఐటీయూసీ నాయకులు మురళి, నగోమి బాష, విజయలక్ష్మీ, రూప, మమత, గౌరి, కోకిల, పవిత్ర, ఉషా, షీబా, బ్యూలా, మీనా, గీత, సతీష్, నాగరాజు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణులకు అభిషేకం పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణులు

గంగాధరనెల్లూరు, జనవరి 7: ధనుర్మాసం కావడంతో మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ప్రధాన ఆలయంలోని మూలవిరాట్ విగ్రహాలకు అర్చకులు ఆదివారం అభిషేకంపూజలు వైభవంగా నిర్వహించారు. మొదటగా స్వామి, అమ్మవార్లకు పాశురం తిరుప్పావై సేవ పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు లక్ష్మీనారాయణస్వామి, అష్టలక్ష్మి ఆలయాలతో పాటు కోనేరు వద్ద గల పలు ఆలయాలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, శేఖర్‌స్వామి, భక్తులు పాల్గొన్నారు.